# కోట గోడలు

పురాణ భారతభూమికి మాపల్లెటూరు వెన్నెముక. సందెమసకతో కోట గోడలమీద నిలబడి చూస్తే, వెచ్చకోసం ఒకరి నొకరు హత్తుకొని కూర్చున్న మార్గస్థుల గుంపులాగుంటాయి మా ఊరి పూరి గుడిసెలు. దూరాన పంటకాలవ పాములాగ వరిచేలల్లోంచి వంపులు తిరుగుతూ మా ఊరిని చుట్టి ప్రవహిస్తున్నది.

మా ఊరి రాజవీధి కోటగుమ్మం దగ్గర ఆఖరవుతుంది. వీధికి ఇరు ప్రక్కలా ఇళ్ళకు మధ్య అక్కడక్కడ లోతైన పాటి గోతులు ఆవులిస్తూ అకాశంవేపు చూస్తుంటాయి. ఇండ్ల ఆవరణకు చుట్టూ మట్టితో కట్టిన కుదురుగోడలు వానలకు కరిగి చారికలు పడ్డాయి, మదుర్లమీది పెంకులు జారి

పోయాయి అక్కడక్కడ. ఆ వారికలు పాతబడిపోయాయి. వీధి మధ్య లో గుంటలుకూడా ఎప్పుడో పాతబడి పోయాయి. మా ఊళ్ళో కొత్తది ఏదీ కీంతను. పాతపడ్డదాకా దేన్నీ గుర్తించడం మాకు అలవాటు లేదు.

మా ఊళ్ళో అన్నిటికన్నా పాతవి కోటగోడలు. అంచేత అవి మా ఒకందరి గర్వకారణం. ఆ గోడలు మా రాజవంశీయులకు ఆదిపురుషుడు వందమైళ్ళ దూరాన్నున్న అరుద్రకోడునుంచి మట్టి తెప్పించి, మేక పాలతో మర్దించి కట్టించాడని ప్రతీతి. ఒకానొకప్పుడు ఆంగ్ల సైన్యాలు మా కోటని చుట్టు ముట్టాయనీ లోపలికి బయటకి. మనుష్యుల రాకపోకలే కాకుండా, సరుకుల రవాణా కూడా అరికట్టాయనీ, అప్పటి రాజా వారు. వారి సైన్యాలూ ఆకలి దప్పులబాధ కాగలేక లొంగి పోయినప్పటికీ కోటగోడలు మాత్రం ఆంగ్ల శతఘ్నుల ధాటికి అణుమాత్రం జంకక గర్వంగా నిలబడి భారతభూమి గౌరవం కాపాడాయనీ. మా పెద్దలు మాకు కథలుగా చెప్పేవారు కాని ఇంత పౌరుషవంతమైన కోటగోడలూ కాలం తాకిడికి మాత్రం తలొగ్గి ఈ నాడు శిధిలావస్థలో ఉన్నాయి. గోడల పైభాగం అంతా అడివిలా దట్టంగా చెట్లు పెరిగి పోయాయి. మా కోటగోడ లిప్పుడు త్రాచు పాములకు ఆవాసాలైయినాయి.

మా ఊళ్లో కరణం రామలింగం ఉన్నాడు. పురోహితుడు సుబ్బావధాని ఉన్నాడు, కోమటి సుబ్బన్న ఉన్నాడు. మంగలి రామన్న ఉన్నాడు. అతనే మా ఊరి వైద్యుడు కూడా.

వీరుగాక మా ఊళ్ళో పద్మసాని ఉంది. దొంగప్పన్న ఉన్నాడు. మా ఊళ్ళో అన్నింటిలాగే పద్మసానికి దొంగప్పనకి మధ్య తగాదాకూడ చాల పురాతనమైనది అల్లిబిల్లిగా అల్లుకుపోయినా చరిత్ర అవే డొంకంతా కదిలించి ఈ తగాదల తాలూకు తల్లి వేళ్ళు ఎక్కడున్నాయో పట్టుకోడం ఈనాడు అసంభవం. ఒకరికొకరు గర్భశత్రువులని, ఇద్దరికీ తెలును, అంతే.

పద్మసాని ఇల్లు కోటగోడను అనుకుని వుంది ఒకప్పుడాఇల్లు చాలా వైభవంగా ఉండేది. అవైభవం తాలూకు చిహ్నాలు. కాలమనే సాలిపురుగు అల్లిన దట్టమైన గూడులోంచి. ఈనాడు కూడా తొంగి చూస్తుంటాయి. దొంగప్పన్న ఇంటికి. అఇంటికీ మధ్య ఒక్కగోడే అడ్డం. దొంగప్పన్న దొడ్డి కూడా కోటగోడని అనుకునే ఉంది. పద్మసాని అమ్మమ్మ "కలవాణి." రాజావారిలో తనకుగల పలుకుబడివి పురస్కరించుకుని అప్పన్న తాతని అఇంట్లోంచి వెళ్ళగొట్టించి తన స్వాధీనంలోకి తెచ్చుకోవాలని ప్రయత్నించిందట.

అతను మాత్రం ధైర్యంగా నిలబడి తనఇల్లు కలవాణి కాజెయ్యకుండా కాపాడుకున్నాడట. ప్రస్తుత పద్మసానికి దొంగప్పన్న ఇల్లు సొంతం చేసుకోవాలన్న ఆశాలేదు. అందుకు అవకాశములేదు. జమీందారువారి అసరా అంతకన్నా లేదు. కాని ఏదితరిగినా తగాదా మాత్రం పెరుగుతునే ఉంది. తగాదాల డొంక ప్రతిదినం కొత్త చిగుళ్ళు తొడుగుతూనే ఉంది.

ఆరోజున తగాదా దొంగప్పన్న కోడిపెట్ట మూలంగా వచ్చింది. ఆది మదురుదాటి పద్మాసాని పెరట్లోకి పోయింది. అప్పన్న కోటగోడ ఎక్కి దాన్ని మొహమాట పెట్టి తిరిగి తన దగ్గరకు తెమ్చుకోవాలని ప్రయత్నించాడు. కాని అది తిన్న ఇంటికి ద్రోహం తలపెట్టి. రెండుఇళ్ళకూ మధ్య అనాదిగా వస్తున్న వైరాన్ని మరిచిపోయి పద్మసాని కోడిపుంజుతో సిగ్గూ బిడియం విడిచి సరసాలాడ్డం ప్రారంభించింది. దొంగప్పన్నకి కోపం ఆగలేదు. కోటగోడ మీది నుంచి పద్మసాని పెరట్లోకి మెట్లున్నాయి - వెనక ఎప్పుడో వాటిఉపయోగం ఉండేది వాటిమీద ఏమనిషయినా అడుగుపెట్టి కొన్నిసంవత్సరాలై ఉంటుంది.

అప్పన్న కోపంతో ఒళ్ళు మరిచిపోయాడు. ఆ మెట్లు చక చక దిగాడు తన పెట్టని పట్టబోయాడు అది దుబ్బులచుట్టూ అతన్ని తిప్పి మూడుచెరువుల నీళ్ళు తాగించింది. ఆయినా పట్టుదలగా దానివెనకాల పరిగెత్తాడు.

"హఠాత్తుగా."

"దొంగ! దొంగ!" అన్న పద్మసాని గొంతు విన్నాడు. పిడుగుపడినట్టు నిలబడిపోయాడు. ఇరుగు పొరుగు జనం చేరేసరికి కోడిపెట్ట మళ్ళీ అప్పన్న దొడ్లోకి ఎగిరి పోయింది తను దొంగతనం కోసం రాలేదని నలుగురికీ రుజువు చెయ్యడానికి సాక్ష్యంగానైనా అది పద్మసాని దొడ్లో ఆగలేదు ఆఖరికి.

పద్మసాని తన్ను దొంగ అన్నందుకు అప్పన్నకి కోపం రాలేదు. పట్టపగలు దొడ్లలోకి దూరి దొరికింది పట్టుకుపోయే చిల్లర దొంగకాదని పద్మసానికి బాగా తెలుసు అతను దొంగతనానికి పోతే ఇంటికి కన్నంవేసి అర్ధరాత్రివేళ రాజాలాగ ప్రవేశిస్తాడు పద్మసాని "దొంగ దొంగ" అని అరవడం. పట్టపగలు అతను ఆమె దొడ్లో నలుగురికీ కనపడ్డం. అతనికి తల తీసేసినట్లయింది.

ఆ రోజున పద్మసాని మీద అంతులేని ద్వేషం కలగడానికి మరో కారణం ఉంది.

అది వరకు పద్మసాని అతన్ని ఎన్నోసార్లు దూషించింది. కాని స్త్రీ సహజమైన సిగ్గు కనబరుస్తూ తలుపు వెనక నిలబడి ఆమె ఎంతగా అతన్ని దూషించినా. ఆమె కంటిఎదుట లేకపోవడం కారణంగా. అతను ఆమెకేమీ తీసిపోకుండా దులిపెయ్యగలిగేవాడు. ఈరోజుని అతనికట్టెదుట నిలబడి ఆమె తిట్టింది. అతని పెదవి పెగలలేదు. అతని గర్వం దెబ్బతింది.

అప్పన్నకి సృష్టిలో మూడు గర్వశత్రువులు, మొదటిది ఆడది. ఆడదాని ముఖం వెపు కన్నెత్తి చూస్తే అతని నవనాడులు క్రుంగిపోతాయి. అతనికి ముచ్చెమటలు పోస్తాయి వయసులో ఉన్నపుడు అతనికి కొంతమంది పడుచులతో చనువు ఏర్పడక పోలేదు. అయితే ఆచనువు గుడ్డిఉద్రేకంలో అర్ధరాత్రి చీకటి మరుగున ఏర్పడ్డాది. వీధిలో అతనికి ఆడదిఎదురయితే అతను దూరంగా తొలగిపోయి తలవంచుకుని ఈగండం గడిస్తే చాలన్నంత ఆందోళనతో సాగిపోతాడు ఆడవాళ్ళంటే అతనికి గౌరవం, ఈర్ష్య, భయం.

అతని రెండో శత్రువు ఎలుక. అతను కన్నం వేసినప్పుడు చూరెలుకలు చప్పుడు చేస్తే అతను మంచుగడ్డలా బిగుసుకుపోతాడు. ఎంత భయంకరమైన కుక్కనయినా అతను సునాయాసంగా మచ్చిక చేసుకోగలడు. కాని అతని లాలనకి అణుమాత్రమైనా లొంగకుండా జర్రున జారిపోతాయి ఎలుకలు.

ఇంక మూడో శత్రువు - రాంబాబు; పద్మసాని రెండేళ్ళ కొడుకు. ఆమెకు నలభయ్యోపడి దాటిపోతుందనగా అనుకోకుండ పుట్టాడు. అతని కళ్లు రెప్పవాల్చకుండా సూటిగా చూసి అతన్ని భయపెడతాయి. ఆ చూపులు అప్పన్న గుండెల్లోకి చొచ్చుకుపోయి అక్కడ పేరుకుపోయిన అశాంతిని కివ్వంలాగ చిలికి మనసంతా గందరగోళం చేసేస్తాయి తల్లిలాగ రాంబాబు ఎప్పుడూ అప్పన్నని తిట్టి ఎరుగడు. అంతేకాదు అతని చూపులో చనువు చేసుకోవాలన్న కుతూహలం ఆకలిగా అవురుమంటుంది. అయితే ఏరకమయినా బంధాలన్నా అప్పన్నకి అపరిమితమయిన భయం ఆచూపులు అతనికి యమపాశాల్లా కనబడతాయి. రాంబాబు ఎదట లేకపోయినా ఆచూపులు అతన్ని వెంటాడుతుంటాయి.

ఆ మధ్యాహ్నం అలవాటు ప్రకారం అప్పన్న కోటగోడ ఎక్కి రావి చెట్టు నీడలో నడుంవాల్చుకున్నాడు. అరవై ఏళ్ళ అతని జీవితంలో ఆనాడు జరిగినంత అవమానం ఇంకెప్పుడు జరగలేదు. అతనికి జ్ఞానం వచ్చిన దగ్గర నుంచీ జరిగిన విషయలన్నీ తెరమీద బొమ్మల్లాగా అతని మనసులో కొచ్చి ఒత్తిడి చేసాయి.

అయిదేళ్ళ వయసులోనే తండ్రితో బాటు కన్నాలకు బయలుదేరి అతను కులవిద్య అతిశ్రద్ధగా నేర్చుకున్నాడు అతని వేళ్ళకు అతిసున్నితమయినా స్పర్శజ్ఞానం అలవడింది. ఏగోడనైన సరే అతను తనవేళ్ళతో ఆప్యాయంగా తడిమితే, ఆగోడ తన రహస్యాలన్నీ అతనికి విప్పి చెప్పేస్తుంది.

ఇటుకలు గుల్లబారిపోయాయో ఎక్కడ పిమెంటు గుణపం పోటుకిన్నా జంక కుండా విగుసుకు పోయిందో, అన్నీ దాపరికం లేకుండా చెప్పేస్తుంది. ఈనాటి కన్నపు దొంగలకు ఆ స్పర్శజ్ఞానం పోయింది.

వయసులో ఉన్నప్పుడు పద్మసాని మహావయ్యారంగా ఉండేది ప్రతి సాయంత్రం ఆమె అందంగా అలంకరించుకొని తన దొడ్డిలోంచి మెట్లద్వారా కోటగోడ ఎక్కి అవతలపక్క కోటలోకి దిగిపోతుండేది. రావిచెట్టు నీడలో విశ్రమిస్తూ పడుకున్న అప్పన్న ఆమెను రోజు చూస్తుండేవాడు. ఆమెమెడ పండు తమలపాకులా వుండేది. దాని మీదా కన్నపు కత్తి కన్నా సన్నగా మూడు చారలుండేవి. చిన్నగడ్డానికి సరిగ్గా మధ్యని చక్కని సొట్ట ఉండేది. మధ్య పాపిడితీసిన ఆమెముఖం ఎదురుగా నిలబడి చూస్తే అరకు మక్కలా గుండేది. అతను రావిచెట్టు మొదట్లో తన కన్నపు కత్తిలో ఎన్నో అరకు మక్కలు గీశాడు ఆ రోజుల్లో. అవన్నీ ఇంకా అల్లాగే ఉన్నాయి. వెనకటి రోజుల్లో ఆమె ముఖాన్ని గుర్తుకు తెస్తున్నాయి.

ఆ రోజుల్లో పద్మసాని పెరట్లో మంచి పూలతోట వుండేది. అప్పుడ ప్పుడు ఆస్థాన కవిగారు ఆ పెరట్లో ఆమెతో కూర్చుని పద్యాల్లోనే ఆమెతో సంభాషణ సాగించేవారు. ఆమె పద్యాల్లోనే సమాధానం చెప్పేది. ఆమె గొంతు తీగలాగమోగేది. అప్పన్న రావిచెట్టు మొదట్లో పడుకుని చెవులప్పగించివినేవాడు.

ఆమెపూర్తి పేరు పద్మాయాక్షి. రాజుగారి మేనత్త పెట్టిందా పేరు. రాజావారికి పద్మసానికి మధ్యప్రణయాన్ని వర్ణిస్తు మంచి ప్రబంధ మొకటి రాసారు ఆస్థాన కవిగారు.

పద్మసానికి కులవృత్తి మీద గురి చాలఎక్కువ అయితే కాలప్రభావాకి లొంగి పోయి తన కుమార్తెల కిద్దరికి ఆమె పెళ్ళిళ్లు చేసేసింది. అందుకు

అన్నివిధాలా తగిన అల్లుళ్ళు దొరకడం ఒకటే కారణం కాదు అప్పటి రాజావారి ఆదరం సన్నగిల్లిపోవడం ముఖ్యకారణం. ఆ పెళ్ళికెప్పుడు అలంకరించారో ఆ ఇంటిని. ఆ తరువాత మళ్ళీ ఆ ఇంటికి వెనకటి కళ ఎన్నడూ రాలేదు పూలతోటలో చీదరగా గడ్డి గాదం మొలిచిపోయాయి. గోడలకు వెల్లవెలిసి పోయింది. ఇంటి కప్పొకపక్క దిగిపోయింది. అది బాగుచేయించే ప్రయత్నం జరగలేదు. రాజావారే కోటవదిలేసి పట్నానికి పోయారు. అంచేత పద్మాయతాక్షి మెట్లెక్కి కోటలోనికిపోయే అవసరం తీరిపోయింది. ఆ మెట్లఅంచులు అరిగిపోయాయి. పద్మాయతాక్షి శరీరంలోని సున్నితమైన వంపులన్నీ పూడిపోయాయి ఆమె నడక మొద్దుగా బరువుగా తయారైంది. ఆ వెనకటి అందానికి చిహ్నాలుగా మెడమీద మూడు గీతలు అప్పన్నకిప్పుడు. మట్టుకు మిగిలాయి. ఆమెను చూస్తేవెగటు.

అప్పన్నకి పద్మసానికీ మధ్య తగాదాలు ఎలా ప్రారంభమైనా ఒకలాగే అంతమవుతాయి. తన కులవృత్తి పద్మసాని కులవృత్తికంటే చాల గౌరవమైనదని గట్టి నమ్మకం కాని అది రుజువు చెయ్యడానికి అవసరమైన వాదాలేవి తోచేవి కావు. అంచేత ఆమె గొంతు పెద్దది చేసి

"కన్నాలేసుకు బతికే వెధవ్వి నువ్వా మాట్లాడ్డవే." అనగానే

"అబ్బోసి. కన్నెపిల్లవి. ముగ్గురు బిడ్డల్ని కన్నావు." అని ఎత్తిపొడిచేవాడు ఆ మాట అనగనే ఆమె మూర్ఛపోయింది. "అబ్బా" అని అరుస్తూ. వైద్యుడు రాముడు అది గుండె జబ్బని అన్నప్పటికీ. అప్పన్నకి మట్టుకు అదొక పెద్ద నాటకమని అనుమానం.

ఆనాటి పొద్దున్న అతనికి అన్యాయంగా జరిగిన అవమానం అతనితో అగ్ని పర్వతంలా రగిలింది.

అంతవరకూ అప్పన్న పద్మసాని ఇంటికెన్నడూ కన్నం వెయలేదు ఆమె ఆడది. ఒంటరిది. ఏసహాయంలేని ఆమె ఇంటిని దోచుకోవడం తన వృత్తి ధర్మానికి వ్యతిరేకమనిపించి ది. అప్పన్నకి కాని ఆ ఉదయం జరిగిన గొడవైన తరువాత ఆతకమైన సంకోచాలు తనకనవసర మని పించింది అప్పన్నకి. ఆమె తన హద్దుమీరి. ఆడదైయుండికూడా ఆతన్ని ఎదుటబడి బహిరంగగా తిట్టింది. ఇంక తనహద్దుల్లో మాత్రం అతనెందు కుండాలి? ఆమె ఇంటికి కన్నం వేస్తే అతని కేమి దొరుకుతుందన్నది వేరే విషయం. కన్నం వెయ్యడమే ముఖ్యం.

అర్ధరాత్రివేళ తన తొడలాగు తొడుక్కున్నాడు.. అలవాటు ప్రకారం ఒంటికి ఆముదం పట్టించాడు - ఎవరైన పట్టుకుంటే జారిపోడానికి. కన్నపు కత్తి మొలలో దోపాడు. బుగ్గని పొగాకు బిగించాడు. అడ్డుగోడ దూకి అవతల ఆవరణలో ప్రవేశించాడు.

పద్మసాని పడక గది ఇంటికి దక్షిణాన్నుంది. కాని ఆ గదికి కన్నం వెయ్యడానికి అతనికి మనసొప్పలేదు. ఉత్తర వేపుని ఉన్నది. ఆ ఇంట్లోకి పెద్దహాలు. హాలుకి కన్నం వెయ్యడం అతని వృత్తి విద్యకే వ్యతిరేకం. అయినా సరే అతను హాలు కిటికీ ప్రక్కని మోకరించి కూర్చున్నాడు. కళ్ళు మూసుకున్నాడు. గోడని ఆప్యాయంగా నిమిరాడు. చూపుడువేలితో సున్నితంగా కొట్టి చూచాడు ఆగోడ ఇచ్చిన సమాధానం అతిశ్రద్ధగా విన్నాడు. కిటికీక్రింద ఒకచోటు చూసుకున్నాడు. తను లోపలికి దూరడానికి వీలైనంత కన్నం తవ్వుతున్నాడు.

కన్నపుకత్తి మొలలో దోపాడు. కళ్లు మూసుకుని చేతులు జోడించి కులపెద్దల్ని భక్తిగా తలచుకున్నాడు. ఒంగి జాగ్రత్తగా ఆ కన్నంలోనుంచి లోపలికి తొంగి చూసాడు. లోపల చీకటి. నిశ్శబ్దం. అలవాటు ప్రకారంకాళ్ళు కన్నంలోపెట్టి మెల్లగా మోచేతులమీద లోపలికి దేకాడు అరవైఏళ్ళ అతని

అవయవాలు, ఇంక అతను చెప్పినట్టు వింటాయి. కాస్త చప్పుడైనా చెయ్యకుండా లోపలికి చేరుకున్నాడు. కాళ్ళమీద లేచి నిలబడ్డాడు. కళ్ళు చీకటికి అలవాటు పడేదాక కాస్త నిలబడ్డాడు.

అకస్మాత్తుగా అతని నరాలన్నీ బిగుసుకుపోయాయి. చెమటతో శరీరమంత తడిసి ముద్దయిపోయింది. ఆచీకటిలోనుంచి ఒక ఆకారం క్రమంగా అతని ఎదుట రూపొందింది. ఆ ఆకారం రాంబాబు.

రాంబాబు మౌనంగా అప్పన్న కళ్ళలోకి చూశాడు. అప్పన్న మనసంతా పిండిముద్దలాగై పోయింది. అతడు చలనం లేకుండా స్తంభించి పోయాడు. కాస్త తెప్పరిల్లి పారిపోవాలన్న ఆలోచన మనసులో ప్రవేశించేసరికి రాంబాబు గొంతు అతని మనసుని వలలో పట్టింది.

"అప్పన్నా, ఎళ్లిపోకు," అంది ఆ గొంతు.

ఆ గొంతులో అస్పష్టంగా ధ్వనించిన ఆందోళన అప్పన్నకి ఆశ్చర్యం కలిగించింది.

"అమ్మ అలా ఉందేం?" అన్నాడు రాంబాబు, పడకగదివేపు చూపిస్తూ. అప్పన్న సమాధానం చెప్పకుండా అతన్ని అనుసరించాడు.

పద్మసాని శరీరం అసందర్భంగా మంచం మీద పరచుకుని ఉంది. మెడ అసహజంగా వంపు తిరిగి, మంచం పట్టీ ఇవతల వేళ్ళాడుతోంది. పెదవుల సందు నుంచి కారిన రక్తం నేలమీద చిన్నమడుగు చేసింది. కొంత పెదవుల కొసని పేరుకు పోయింది.

"నాకు బయంగుంది," అన్నాడు రాంబాబు. చటుకుని అతన్ని చంకనేసుకుని బయటికి పరిగెత్తాడు అప్పన్న.

"గుండె జబ్బు," అన్నాడు వైద్యుడు రాముడు.
పద్మసాని అంత్యక్రియలు సుబ్బావధాని చేయించాడు. దహనం అవు

తుంచే కరణం రామలింగం బతికున్నా రోజుల్లో ఆమె వైభవాన్ని వర్ణించాడు అంతసేపు రాంబాబు అప్పన్న దంకనే అంటి పెట్టుకుని ఉన్నాడు. అప్పన్న కూర్చోలేదు. పద్మసాని ఇంటి హాలులో ఉన్న కన్నాన్ని గురించిగాని, అప్పన్న వేసుకున్నా తొడలాగు, పూసుకున్న ఆముదాన్ని గురించిగాని ఎవరూ ప్రస్తావించలేదు.

దహనమయ్యాక అడ్డదారిని ఇంటికి బయలుదేరాడు అప్పన్న. కోట గోడఎక్కాడు. కాలిదారిన తన ఇంటి వెనక ఉన్నా రావిచెట్టు నీడకొచ్చాడు.

అకస్మాత్తుగా అప్పన్నకి బ్రతుకులో ముఖ్యమైనదేదో జారిపోయినట్టు అనిపించింది. పద్మసాని దొడ్డివేపు చూసాడు. నేలంతా రకరకల మొక్కలతో చీదరగా పెరిగిపోయింది-ఎన్నడు మనిషి సంచారం ఎరగానట్టు. కోట గోడ శిధిలామైపోయింది. తనుకూర్చున్నచోటు ఎన్నడూ చూడనటువంటి అడవిలాగా అనిపించింది. అతను చటుక్కున చతికిలబడిపోయాడు. అరవై ఏళ్ళ అలసట ఒక్క సారిగా అతని అవయువాలను నిర్వీర్యం చేసింది. నిద్రపోతున్నా రాంబాబును ఒళ్ళోకి తీసుకున్నాడు సున్నితమైన తనవేళ్ళతో అతని లేత చెక్కిలి నిమిరాడు. కన్నపుకత్తి మొలలో గుచ్చుకుంటోంది. చాలసేపుగా. అది లాగాడు ఇటు అటూ తిప్పిచూశాడు. ఆ పగటి ఎండలో అది తళతళ మెరిసింది. అతను ఎన్నడు ఎరగని వింత ప్రాణిలా అతని చేతికది కొత్తగా తగిలింది.

అతని వొళ్ళు గొంగళిపురుగును తాకినట్టు జలదరించింది. తొందరగా ఆకత్తిని శక్తికొద్దీ విసిరేసాడు. ఆ కత్తి ఆ కోటగోడల శిధిలాల్లో ఎక్కడో కలిసిపోయింది.

రావిచెట్టు మొదలు నానుకుని కళ్ళు మూశాడు. రాంబాబు అతని ఒళ్ళో నిద్రపోతూనే ఉన్నాడు.



(యువ, దీపావళి 1962)